సాక్షి
రంగారెడ్డి
శనివారం । 25 । నవంబర్ । 2023



మోసం చేసి కారెక్కారు

కాంగ్రెస్ పార్టీని మోసం చేసి కారెక్కినోళ్లను ఓడించాలని హస్తం పార్టీ మహేశ్వరం అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కోరారు. 8లో▸



కోటి కుటుంబాలకు 'బీమా'

బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే కోటి కుటుంబాలకు కేసీఆర్ బీమా వర్తింపజేస్తామని కాలె యాదయ్య హామీ ఇచ్చారు. 8లో▸



అవగాహన పెంచుకోండి..

ఎన్నికల వేళ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కడ్తాల్ జెడ్పీహెచ్ఎస్‌లో మాక్ పోలింగ్ నిర్వహించారు. 8లో▸

గడప దాటని అమాత్యులు!

సొంత నియోజకవర్గాలకే పరిమితమైన మంత్రులు

- పార్టీ జిల్లా అధ్యక్షులదీ అదే వరుస
- కేసీఆర్, కేటీఆర్ సభలు, రోడ్డు షోలపైనే ఆశలు
- ఉమ్మడి జిల్లాలో స్టార్ క్యాంపెయినర్లు కరువు
- ప్రభుత్వ పథకాలు, సొంత ప్లానింగ్‌తోనే అధికారపార్టీ అభ్యర్థుల ప్రచారం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఒకప్పుడు మంత్రులదే హవా.. పాలనా పరమైన అంశాల్లోనే కాదు ఎన్నికల సమయంలోనూ కీలకంగా వ్యవహరించేవారు. తమ విజయంతో పాటు పార్టీ అభ్యర్థుల గెలుపు బాధ్యతను సైతం భుజాన వేసుకుని ప్రచారం సాగించేవారు. ప్రస్తుతం జిల్లాలో ఆ పరిస్థితి కన్పించడం లేదు. ఇంటి గడప దాటి బయట అడుగు పెట్టిన దాఖలాలు లేవు. చిన్న చిన్న ర్యాలీలు మొదలు రోడ్‌షోలు, బహిరంగ సభలు.. ఇలా ప్రతి దానికీ పార్టీ అధినేతపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో విద్యాశాఖమంత్రి సబితారెడ్డి మహేశ్వరం నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండగా, కార్మికశాఖ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి మేడ్చల్ జిల్లా నుంచి, పట్నం మహేందర్‌రెడ్డి వికారాబాద్ నుంచి మంత్రిగా కొనసాగుతున్నారు. ఎన్నికల ప్రచారంలో స్టార్ క్యాంపెయినర్లుగా వ్యవహరించాల్సిన వీరంతా ప్రస్తుతం సొంత నియోజకవర్గాలకే పరిమితమయ్యారు. ప్రత్యర్థి పార్టీల నుంచి గట్టి పోటీ ఎదురవుతుండటంతో వారు తమ గెలుపు కోసం సర్వశక్తులూ ఒడ్డాల్సివస్తోంది. చివరికి వీరు కూడా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ వైపే చూడాల్సి వస్తోంది. చేవెళ్ల, వికారాబాద్, తాండూరు, పరిగి అభ్యర్థుల తరఫున స్టార్ క్యాంపెయినర్‌గా పని చేయాల్సిన మంత్రి మహేందర్‌రెడ్డి కొడంగల్‌లో తన సోదరుడు పట్నం నరేందర్‌రెడ్డి తరపున మాత్రమే ప్రచారం సాగిస్తున్నారు.

జిల్లా అధ్యక్షులదీ అదే పరిస్థితి

బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి మరోసారి బరిలో నిలిచారు.. జిల్లా అధ్యక్షుడిగా ఇతర నియోజకవర్గాల్లోనూ ప్రచారం చేయాల్సిన ఆయన ప్రస్తుతం పూర్తిగా సొంత నియోజకవర్గానికే పరిమితమ య్యారు. వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ వికారాబాద్ సరిహద్దులు దాటి బయటికి రావడం లేదు. మేడ్చల్ జిల్లా అధ్య క్షుడు శంభీపూర్‌రాజుకు మల్కాజిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో ఆయన కూడా ఆ నియోజకవర్గం దాటి బయటికి వెళ్లడం లేదు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ప్రచారానికి వచ్చినప్పుడు మినహా ఇతర సందర్భాల్లో జనంలో పెద్దగా కన్పించడం లేదు.

సొంత చరిష్మానే నమ్ముకున్న అభ్యర్థులు

ఇక చేవెళ్ల ఎంపీగా కొనసాగుతున్న రంజిత్‌రెడ్డి కేవలం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, హరీశ్‌రావు వంటి ముఖ్యనేతలు జిల్లాకు వచ్చిన సమయంలోనే ఆయా వేదికలపై కన్పిస్తున్నారు. ఆ తర్వాత ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల తరపు ప్రచారం చేస్తున్న దాఖలాలు మచ్చుకు కూడా కన్పించడం లేదు. ఎమ్మెల్సీలు యెగ్గే మల్లేశం, సురభివాణి దేవి, బి.దయానంద్ సహా నామినేటెడ్ పోస్టులు పొందిన వారు సైతం ప్రచారంలో పెద్దగా కనిపించిన దాఖలాలు లేవు. ఆయా నియోజకవర్గాల అభ్యర్థులు పార్టీ పథకాలు, అగ్రనేతల సభలు, సొంత చరిష్మానే నమ్ముకుని ముందుకు వెళ్తున్నారు.

వెంటాడిన అనారోగ్యం

మనస్తాపంతో ఉరివేసుకుని కానిస్టేబుల్ బలవన్మరణం



రాజేష్ మృతదేహం

మొయినాబాద్: కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓ కానిస్టేబుల్ మనస్తాపానికి గురై ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మొయినాబాద్‌లో శుక్రవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కర్మన్‌ఘాట్ ప్రాంతానికి చెందిన కాటం రాజేష్ (30) సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో అతని భార్య రెండేళ్ల క్రితం విడాకులిచ్చింది. ఆరోగ్యం బాగులేకపోవడంతో ఆరు నెలలుగా విధులకు సైతం వెళ్లడం లేదు. చాలా ఆస్పత్రులకు తిరిగినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో ఈ నెల 22న మొయినాబాద్‌లోని స్టార్ కాలనీలో నివసించే అక్క సునీత ఇంటికి తల్లితో కలిసి వచ్చాడు. గురువారం అర్ధరాత్రి వరకు ఇంట్లో అందరూ కలిసి ఆస్పత్రిలో చికిత్స గురించి మాట్లాడుకున్నారు. శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో రాజేష్ పడుకున్న గది తెరిచిచూసే సరికి ఫ్యానుకు ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్‌రీల్

రూ.35లక్షల నగదు పట్టివేత



కందుకూరులో పట్టుబడిన నగదు

కందుకూరు: పోలీసుల తనిఖీలో రూ.35 లక్షల నగదు పట్టుబడిన సంఘటన మండలంలోని ఫార్మాసిటీ రోడ్డులో శుక్రవారం చోటు చేసుకుంది. ఎన్నికల నేపథ్యంలో ఫార్మా రోడ్డులో ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ సిబ్బంది, కందుకూరు పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ కారులో కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి కరపత్రాలతో పాటు రూ.35 లక్షలు గుర్తించారు. నగదును స్వాధీనం చేసుకొని కారులో ప్రయాణిస్తున్న ముగ్గురిని విచారిస్తున్నారు.

విద్యార్థులు మేధోశక్తిని పెంపొందించుకోవాలి



జ్యోతిప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న పురుషోత్తంరెడ్డి తదితరులు

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు మేధోశక్తిని పెంపొందించుకునేందుకు అన్ని రంగాల్లో పాలు పంచుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఫార్మసిస్టు అసోసియేషన్ రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్‌వీ పురుషోత్తంరెడ్డి అన్నారు. హిమాయత్‌నగర్ సమీపంలోని చైతన్య డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయంలో రెండు రోజులపాటు నిర్వహించే ఫార్మసీ కాన్ఫరెన్స్ శుక్రవారం ప్రారంభమైంది. సదస్సుకు జాతీయ స్థాయిలో వివిధ కళాశాలల్లోని 500 మంది విద్యార్థులకు పైగా హాజరయారు. ఈ సందర్భంగా పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి సదస్సులతో విద్యార్థులకు విజ్ఞానం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో విశ్వభారతి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి సువర్ణదేవి, చీఫ్ పాట్రన్ విశ్వభారతి ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ విక్రమ్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ సాత్విక, వైస్‌చాన్సలర్ ఆచార్య జి.దామోదర్, రిజిస్ట్రార్ ఎం.రవీందర్, కళాశాల డీన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి దినేష్ సాగర్ గుడ్‌బై

మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక

షాద్‌నగర్: ఎస్ఎస్‌యూఐ జాతీయ కన్వీనర్ దినేష్ సాగర్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ మేరకు కేశంపేట ఎంపీపీ రవీందర్ యాదవ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ మంత్రి కేటీఆర్‌ను కలిసి ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం దినేష్ సాగర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ వద్ద డబ్బులు తీసుకొని ద్రోహం చేస్తున్నారంటూ కాంగ్రెస్‌పార్టీ నేతలు తమపై ఎన్నో అభాండాలు వేశారని అన్నారు. ఆత్మగౌరవాన్ని చంపుకొని పని చేయలేమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం శాయశక్తులా కృషి చేస్తామని పేర్కొన్నారు.



మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన దినేష్ సాగర్

నంబర్‌వన్ లీడర్ కేసీఆర్

- హోంమంత్రి మహమూద్ అలీ


చేవెళ్ల: రాష్ట్రంలో ఈనెల 30న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటువేస్తే డిసెంబర్ 3న వచ్చే ఫలితాలతో కాంగ్రెస్, బీజేపీ ఢిల్లీకి టికెట్ తీసుకొని వెళ్లిపోతాయని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. మండలకేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో శుక్రవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ మైనార్టీ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం మహాత్మాగాంధీ తీసుకువస్తే వందేళ్ల తరువాత అలాంటి నాయకుడు కేసీఆర్ వచ్చి తెలంగాణ తెచ్చారని కొనియాడారు. మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ పదేళ్లలో రూ.933 కోట్ల బడ్జెట్ ఇస్తే, తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ రూ.1,200 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. మైనార్టీల కోసం గురుకుల పాఠశాలలు, షాదీముబారక్, విదేశీ చదువులకోసం రూ.20 లక్షలు ఇవ్వటం జరుగుతుందన్నారు. మైనార్టీలు కాంగ్రెస్, బీజేపీ వైపు ఉన్నారని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. మైనార్టీలకోసం ఈ పార్టీలు చేసిందేమీ లేదన్నారు. ఢిల్లీలో ఉండే నాయకులు కావాలా గల్లీలో ఉండే నాయకులు కావాలో తెల్చుకోవాల్సిన సమయమన్నారు. మైనార్టీలకు విలువ, గౌరవం ఇచ్చింది కేసీఆర్ అని, ఒక మైనార్టీని హోం మంత్రిని చేశారని గుర్తు చేశారు. చేవెళ్ల ఎమ్మెల్యేగా కాలె యాదయ్యను మరోసారి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యమంలో చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పి.కార్తీక్‌రెడ్డి, ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, పలువురు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



మైనార్టీ సమ్మేళనంలో మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ, పక్కనే ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య



తుక్కుగూడ: ప్రధాని మోదీ సభ కోసం ఏర్పాట్లు



ఆమనగల్లు: కాంగ్రెస్ విజయభేరి సభకు సిద్ధమైన ప్రాంగణం

ప్రచార హోరు

- పోటాపోటీగా సభలు
- చుట్టేస్తున్న అగ్రనేతలు
- నేడు ప్రధాని మోదీ రాక
- తుక్కుగూడ వేదికగా 'విజయ సంకల్ప సభ'
- ఆమనగల్లులో కాంగ్రెస్ విజయభేరి సభ
- షాద్‌నగర్, ఇబ్రహీంపట్నంలో రేవంత్ రెడ్డి ప్రచారం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల సమయం దగ్గరపడుతుండడంతో ప్రధాన పార్టీలు దూకుడు పెంచాయి. అగ్రనేతల ప్రచారాలతో హోరెత్తిస్తున్నాయి. సభలు, సమావేశాలు, రోడ్‌షోలతో తమ అభ్యర్థుల గెలుపు కోసం ముఖ్యనేతలు వరుస కడుతున్నారు. ఇప్పటికే సీఎం కేసీఆర్ మహేశ్వరం, ఇబ్రహీంపట్నంలో పర్యటించగా.. మొయినాబాద్‌లో కేటీఆర్ రోడ్‌షో నిర్వహించారు. తాజాగా శనివారం ప్రధాని మోదీ మహేశ్వరం నియోజకవర్గానికి రానున్నారు. తుక్కుగూడ వేదికగా సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించే బీజేపీ విజయ సంకల్పసభకు ఆయన హాజరుకానున్నారు. ఈ మేరకు మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజ కవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో జనాన్ని తరలించేందుకు కమలనాథులు ఏర్పాట్లు చేశారు. మోదీ పర్యటన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. రోడ్లపై ట్రాఫి క్ రద్దీ ఏర్పడకుండా శ్రీశైలం జాతీయ రహదారితో పాటు తుక్కుగూడ నుంచి శంషాబాద్ వైపు వెళ్లే ఓఆర్ఆర్ సర్వీసు రోడ్లపై ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఇప్పటికే సభాస్థలికి చేరుకుని భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తుక్కుగూడలో నిర్వహించే ఈ బహిరంగ సభ ను విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం బహిరంగ సభ ఏ ర్పాట్లును వారు పరిశీలించారు. అదేవిధంగా ప్రధా ని మోదీ ఆదివారం ఉదయం నందిగామ సమీపంలోని కన్హాశాంతివనంలోనూ పర్యటించనున్నారు.

ఆమనగల్లులో 'కాంగ్రెస్ విజయభేరి సభ'

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం కల్వకుర్తి నియోజకవర్గానికి రానున్నారు. ఆమనగల్లులోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ వేదికగా మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించే పార్టీ 'విజయ భేరి సభ'కు ఆయన హాజరు కానున్నారు. పార్టీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా నిర్వహించే ఈ సభకు ఖర్గే సహా పీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీ చంద్‌రెడ్డి హాజరవుతున్నారు. సభ కోసం ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఇప్పటికే గ్రౌండ్‌ను చదునుచేసి వేదికను సిద్ధం చేశారు. వేదిక ముందు పార్టీశ్రేణులు, ప్రజలు కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు 60 వేల మంది సభలో పాల్గొనేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. సభావేదిక పక్కనే మల్లికార్జున్‌ఖర్గే, రేవంత్‌రెడ్డి హెలికాప్టర్లలో వేర్వేరుగా రానున్నందున అందుకు తగినవిధంగా రెండు హెలీప్యాడ్‌లను సిద్ధం చేశారు. అదే విధంగా షాద్‌నగర్‌లోనూ రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ తరఫున ఆయన ప్రచారం నిర్వహించనున్నారు. ఈ మేరకు పట్టణ సమీపంలో నిర్వహించనున్న సభాస్థలాన్ని వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, పట్టణ సీఐ ప్రతాప్‌లింగంతో కలిసి పరిశీలించి ఏర్పాట్లను సమీక్షించారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం

- ప్రొఫెసర్ హరగోపాల్

షాద్‌నగర్‌రూరల్: భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుతో ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. పట్టణంలోని వీ కన్వెన్షన్ హాలులో శుక్రవారం తెలంగాణ పీపుల్స్ జేఏసీ ఆధ్వర్యంలో 'తెలంగాణ ఉద్యమ కారుల ఆకాంక్ష.. దశాబ్ద పాలన' అంశంపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని, భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మనకు ఓటు హక్కును కల్పించారని, ప్రజాస్వామ్యంలో అది వజ్రాయుధంలాంటిదన్నారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని సూచించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో అవినీతి, అక్రమాలకు పాల్పడకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారిలో సరైన వారిని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే నాయకుడినే ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. నీతి, నిజాయితీగా మనం వేసే ఓటు అవినీతి, అక్రమాలను రూపుమాపి అభివృద్ధికి పునాది కావాలన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు విద్య, వైద్యం పూర్తి స్థాయిలో ఎక్కడా అందించలేదని విమర్శించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజల ఆకాంక్ష నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రమాదంలో ఉన్న ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. సమావేశంలో కర్ణకోట రవీంద్రనాథ్, నర్సింలు, అర్జునప్ప, జనార్దన్, వనమాల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్



మళ్లీ మనమేలే రామక్క

షాబాద్: కార్యకర్తలతో కలిసి రామక్క పాటకు స్టెప్పులేస్తున్న చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య



విజయ తిలకం

మహేశ్వరం: కేసీ తండాలో కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి హారతి పట్టి .. తిలకం దిద్ది స్వాగతం పడుతున్న గిరిజనులు



గెలుపుపై గురి

మంచాల: ఆరుట్లలో నిర్వహించిన ప్రచార సభలో బాణసంచా కాలుస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి



ఇదిగో బొట్టు.. గెలిచేట్టు

షాద్‌నగర్: లింగారెడ్డిగూడలో బీఆర్ఎస్ అభ్యర్థి అంజయ్య యాదవ్‌కు హారతి పట్టి బొట్టు పెట్టి స్వాగతం పలుకుతున్న మహిళలు

అంతర్జాతీయ వేదికపై
సత్తా చాటిన రాష్ట్ర రెజ్లర్లు



సాక్షి, సిటీబ్యూరో: రష్యాలో జరిగిన మాస్కో రెజ్లింగ్ ప్రపంచ గ్రాప్లింగ్ చాంపియన్ షిప్‌లో భారత రెజ్లింగ్ జట్టు విజేతగా నిలిచింది. నవంబర్ 17 నుంచి 19 వరకు జరిగిన ఈ పోటీల్లో ప్రపంచ వ్యాప్తంగా 19 దేశాల క్రీడాకారులు పాల్గొన్నారు. తెలంగాణకు చెందిన రెజ్లర్లు పతకాల పట్టికలో తమదైన ముద్ర వేశారు. శ్రీనిధి (34 కేజీలు)– రెండు బంగారు పతకాలు, నేహా (సీనియర్స్, 84 కేజీలు)– రజతం, వైష్ణవి ఠాకూర్ (46 కేజీలు)– రజతం, శ్రీచక్ర (62 కేజీలు)– కాంస్య పతకాలు సాధించారు. పురుషుల్లో సుధాకర్ యాదవ్ (92 కేజీలు) రజత పతకం సాధించగా...యువ రెజ్లర్లు ఓం దీప్ (73 కేజీలు), మణికాంత్ యాదవ్ (84 కేజీల) విభాగంలో 4వ స్థానంలో నిలిచారు. రెజ్లర్, గచ్చిబౌలి స్టేడియం కోచ్ సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో తెలంగాణ జట్టు కఠోర శిక్షణ పొందింది. ఈ బృందాన్ని గ్రాప్లింగ్ అసోసియేషన్ చైర్మన్ ముంగి జైపాల్ రెడ్డి, అధ్యక్షుడు శ్రీధర్ మహంకాళి, కార్యదర్శి మనోజ్ దాస్ అభినందించారు.

కాంగ్రెస్‌ను మోసం చేసి కారెక్కారు

- నమ్మి ఓటేస్తే అధికారం కోసం పార్టీ వీడారు
- డబుల్ ఇళ్లలోనూ స్థానికేతరులకే ప్రాధాన్యం
- హస్తానికి ఓటేస్తే పేదలకు ఇల్లు, అసైన్డ్ భూములు
- మహేశ్వరం ఎమ్మెల్యే అభ్యర్థి కేఎల్లార్



రోడ్‌షోలో మాట్లాడుతున్న కేఎల్లార్

మహేశ్వరం: పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, అసైన్డ్ భూములు పంచిన కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పార్టీ మహేశ్వరం అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని జాండమ్రి, హర్షగూడ, సిరిగిరిపురం, గంగారం, గంగారం తండా, మైలార్‌బాయి తండా, మెహబ్బత్‌నగర్, తుమ్మలూరు, ఎన్డీ తండా, దయాల్‌గుండు తండా, మహేశ్వరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సాగు భూమి పంపిణీ చేయడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను ఇచ్చారని గుర్తు చేశారు. బడుగుల సంక్షేమమే తమ ధ్యేయమన్నారు. 2018లో నియోజకవర్గం నుంచి గెలిచిన సబితారెడ్డి అధికారం కోసం కన్న తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీ కాదని కారెక్కిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హస్తం హవా వీస్తున్నందున మీ ఓటుతో గెలుపొంది మిమ్ములను మోసం చేసిన వారికి బుద్ధి చెప్పాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలు అమలు చేసి తీరుతామన్నారు. పేదల కోసం బీఆర్ఎస్ సర్కార్ చేసిందేమీ లేదని విమర్శించారు. మన్సాన్‌పల్లి, మంఖాల్, సర్దార్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూంలను స్థానికులకు ఇవ్వకుండా పాతబస్తీకి చెందిన వారికే ఇచ్చిందని ఆరోపించారు. దళిత బంధు, బీసీ బంధు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ఇచ్చారన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న కేసీఆర్ వంట గ్యాస్ ధర పెరిగితే పట్టించుకోకుండా మళ్లీ అధికారంలోకి వస్తే రూ.400 కు సిలిండర్ ఇస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్, పార్టీ సీనియర్ నాయకులు పాండు నాయక్, ప్రశాంత్‌రెడ్డి, కొమరయ్య, కృష్ణ నాయక్, రాజు నాయక్, దశరథ్ నాయక్, పాండు నాయక్, రవి నాయక్, కుమార్, సేవ్యా నాయక్, కొండల్ రెడ్డి, సంగారెడ్డి, సాయి ప్రసాద్, శివ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మితే కరెంట్ కోతలే

బీఆర్ఎస్ అభ్యర్థి అంజయ్య యాదవ్



వెలిజర్లలో అంజయ్య యాదవ్ ప్రచారం

షాద్‌నగర్: కాంగ్రెస్ పార్టీని నమ్మితే కరెంటు కోతలు తప్పవని బీఆర్ఎస్ అభ్యర్థి అంజయ్య యాదవ్ హెచ్చరించారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల, దూసకల్, లింగారెడ్డిగూడ గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి అంజయ్య యాదవ్ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను మోసం చేసేందుకు హస్తం నేతలు మాయ మాటలు చెబుతున్నారని విమర్శించారు. వారి మాటలను ప్రజలు నమ్మొద్దని సూచించారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని, ప్రజా సంక్షేమం కావాలంటే బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని, ఆ పార్టీ నేతలు ప్రజాధనం లూటీ చేశారని ఆరోపించారు. కేసీఆర్‌ను ముచ్చటగా మూడో సారి సీఎంను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మాధవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గాలిమోటరు ఎక్కేద్దాం గిరాగిరా తిరిగేద్దాం!

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల ప్రచారంలో హెలికాప్టర్లు దూసుకెళ్తున్నాయి. రాజకీయ నేతల సుడిగాలి పర్యటనల్లో గిరికీలు కొడుతున్నాయి. అన్ని ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు రోజుకు మూడు, నాలుగు సభల్లో పాల్గొంటున్నారు. బహిరంగసభలతో పాటు, కార్నర్ మీటింగ్‌లు, రోడ్‌షోలు, ర్యాలీలు, సమావేశాలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. దీంతో కొన్ని గంటల వ్యవధిలోనే రాష్ట్రమంతటా పర్యటించాల్సివస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరుసగా వివిధ ప్రాంతాల్లో జరిగే సభల్లో పాల్గొనేందుకు రోడ్డు మార్గంలో వెళ్లడం కష్టసాధ్యంగా మారడంతో అన్ని ప్రధాన పార్టీల ముఖ్య నాయకులు హెలికాప్టర్లపైనే ఆధారపడి పరుగులు తీస్తున్నారు. ఇంచుమించు నెల రోజులుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ప్రతి రోజు మూడు, నాలుగు సభల్లో పాల్గొంటున్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సైతం రోజుకు నాలుగైదు సభలకు హాజరవుతున్నారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు, బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తదితర నాయకులు రాష్ట్రం నలుమూలలా పర్యటిస్తున్నారు. ప్రధాన పార్టీల స్టార్ క్యాంపెయినర్లు కూడా హెలికాప్టర్లలో పర్యటిస్తున్నారు. గత ఎన్నికల్లో రోజుకు 3 నుంచి 4 హెలికాప్టర్లను మాత్రమే వినియోగించగా ఈసారి రోజుకు పది వరకు వినియోగిస్తున్నట్లు అంచనా.

- ప్రస్తుతం రాజకీయ పార్టీలు వినియోగిస్తున్న హెలికాప్టర్లన్నీ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించినవే. కొన్ని సింగిల్ ఇంజిన్ సామర్థ్యం కలిగినవి కాగా, చాలా వరకు డబుల్ ఇంజిన్ సామర్థ్యం కలిగిన వాటినే వినియోగిస్తున్నారు. ఒక్కో చాపర్‌లో ఐదుగురు నుంచి ఏడుగురు ప్రయాణం చేయవచ్చు. దీంతో వీటి కోసం పార్టీలు చేసే ఖర్చు కూడా రూ.లక్షల్లోనే ఉంది. గతంలో గంటకు రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు చార్జీ ఉంటే ఇప్పుడు ఒక్కో హెలికాప్టర్‌కు గంటకు రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు చార్జీలు వసూలు చేస్తున్నట్లు సమాచారం.
- తెలంగాణతో పాటు మరో నాలుగు రాష్ట్రాల్లోనూ ఎన్నికలు జరగడం, అన్ని పార్టీలకు చెందిన నాయకులు విరివిగా పర్యటిస్తుండడంతో చార్జీలను భారీగా పెంచాయని ఏవియేషన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్‌లకు చెందిన పలు ఏవియేషన్ సంస్థలు హెలికాప్టర్లను ఏర్పాటు చేస్తున్నాయి.

సందడిగా బేగంపేట్ ఎయిర్‌పోర్టు..

ప్రముఖుల రాకపోకలు మినహా మిగతా రోజుల్లో నిశ్శబ్దంగా ఉండే బేగంపేట్ ఎయిర్‌పోర్టు సందడిగా మారింది. కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నేతలు, నాయకుల రాకపోకలతో బేగంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి ఢిల్లీకి విమానాలు పరుగులు తీస్తున్నాయి.

ఈవీఎంల కమిషనింగ్ పూర్తి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గానికి సంబంధించిన కమిషనింగ్ ప్రక్రియ శుక్రవారం ముగిసింది. నియోజకవర్గ పరిధిలోని 542 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఈవీఎంలలో పార్టీ పేరు, అభ్యర్థుల పేర్లు, గుర్తులతో కూడిన వివరాలను అప్ లోడింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి మల్లయ్య ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పోటీలో నిలిచిన అభ్యర్థుల ప్రతినిధుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 542 ఈవీఎంలతో పాటు అదనంగా 20 శాతం ఈవీఎంలలో పోలింగ్‌కు వినియోగించనున్నారు. కమిషనింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. అభ్యర్థుల ప్రతినిధుల సమక్షంలో ఓటింగ్‌ను నిర్వహించి అనంతరం వాటిని లెక్కించారు. ప్రతినిధులంతా ఈ ప్రక్రియ సక్రమంగా జరిగిందని నిర్ధారించి సంతకాలు చేసిన అనంతరం ఈవీఎంలకు సీల్ వేసి స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. ఈ స్ట్రాంగ్ రూమ్ రాజేంద్రనగర్ వెటర్నరీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ స్ట్రాంగ్ రూమ్ ఈ నెల 29వ తేదీన అన్ని పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచి పోలింగ్ బూత్‌లకు తరలించనున్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద 24 గంటల పాటు పోలీసు పహారాను కొనసాగిస్తున్నారు. స్ట్రాంగ్ రూమ్‌తో పాటు పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

ఈ నెల 28 నుంచి మద్యం షాపులు బంద్

రాజేంద్రనగర్: ఎన్నికల నేపథ్యంలో శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వైన్స్, బార్లు, కల్లు కంపౌండ్‌లను ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి మూసి వేస్తున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ పోలింగ్ ముగిసిన అనంతరం తిరిగి షాపులను తెరుస్తారని అన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయించినా, మద్యం నిలువ చేసినా వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలను ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 236 కేసులు నమోదు చేశామన్నారు. తమ ప్రాంతంలో మద్యం విక్రయించినా, డంప్ చేసినా ఫోన్ నంబర్ 8712658750లో ఫిర్యాదు చేయాలని కోరారు.

అవినీతిని అంతం చేసేందుకే 'హస్తం'



మల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

- కంపెనీల పేరిట భూములు కాజేశారు
- కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల: అవినీతి పాలనను అంతం చేసేందుకు హస్తానికి ఓటేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆ పార్టీ ఇబ్రహీంపట్నం అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఆరుట్ల బహిరంగ సభలో మాట్లాడారు. కాంగ్రెస్‌కు ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందని.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీల అమలు చేసి తీరుతామన్నారు. పదిహేనేళ్లుగా అధికార పార్టీ పట్నం ప్రజలను మోసం చేస్తోందన్నారు. కంపెనీల పేరిట పేదల భూములను కాజేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలనగానే ఉచిత హామీలు ఇచ్చి గద్దెనెక్కి మరిచిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చస్తున్నారు. నిరుద్యోగం లేక పేదలు నగరానికి వెళ్లి వచ్చే క్రమంలో ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ యువత ఉపాధి కోసం శ్రమిస్తామన్నారు. బీఆర్ఎస్ మాయ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు.

భారీగా చేరికలు

మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు హస్తం గూటికి చేరారు. లోయపల్లి నుంచి మాజీ ఎంపీపీ శ్రీనివాస్ నాయక్, చీదేడ్ సర్పంచ్ రమాకాంత్‌రెడ్డితో పాటు వందలాది మంది కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మర్రి నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం జెడ్పీటీసీ సభ్యుడు భూపతిగళ్ల మహిపాల్, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటి కుటుంబాలకు 'కేసీఆర్ బీమా'



కుమ్మరిగూడలో మాట్లాడుతున్న యాదయ్య

- గ్యారెంటీలను నమ్మి మోసపోవద్దు
- బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాలె యాదయ్య

షాబాద్: బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే కోటి కుటుంబాలకు కేసీఆర్ బీమా వర్తింపజేస్తామని.. అసైన్డ్ భూములు అమ్ముకునేందుకు రైతులకు హక్కులు కల్పిస్తామని బీఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన షాబాద్ మండల పరిధిలోని నరెడ్లగూడ, కుమ్మరిగూడ, పోలారం, పోతుగల్, లక్ష్మారావుగూడ, వెంకమ్మగూడ, మక్తగూడ, రేగడిదోస్వాడ, తిర్మలాపూర్, ఏట్ల ఎర్రవల్లి, తిమ్మారెడ్డిగూడ గ్రామాల్లో షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలను తప్పుదారి పట్టించేందుకే కాంగ్రెస్ ఆరు గ్యారంటీల హామీనిచ్చిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌ను నమ్మితే వందేళ్లు వెనక్కి పోతామన్నారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను తెలంగాణలో అమలు చేస్తున్నామని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇక్కడి పథకాలు అందుతున్నాయా అని ప్రశ్నించారు. రైతుల కష్టాలు సీఎం కేసీఆర్‌కు తెలుసు కాబట్టే.. రైతుబంధు, రుణ మాఫీని చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు శ్రీనివాస్‌గౌడ్, నర్సింహారెడ్డి, వెంకటయ్య, టీఎల్ఎఫ్ జిల్లా లీగల్ అడ్వైజర్ సతీశ్‌రెడ్డి, విశ్వం మాదిగ, సంజీవ, సర్పంచ్‌లు కేతన, మంగమ్మ, ఇస్మత్‌బేగం, అనిత, శ్రీనివాస్‌గౌడ్, రాములు, ఎంపీటీసీ సభ్యులు జమ్ము కమ్మ, సునీత, పార్వతమ్మ, అరుణ పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోండి.. ఓటేయండి

కడ్తాల్ జెడ్పీహెచ్ఎస్‌లో మాక్‌పోలింగ్



ఎన్నికల సామగ్రి



ఓటు వేసేందుకు బారులు తీరిన విద్యార్థులు

ఎన్నికల వేళ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కడ్తాల్ జెడ్పీహెచ్ఎస్‌లో మాక్ పోలింగ్ నిర్వహించారు. సాధారణ ఎన్నికల మాదిరిగానే నోటిఫికేషన్ మొదలు నామినేషన్లు, ఉపసంహరణ, స్క్రూటినీ, గుర్తులు కేటాయింపు, పోలింగ్ కేంద్రాలు, బూత్‌లు, ఎన్నికల అధికారులు, పోలీస్ బలగాలు, ఈవీఎంల రక్షణ తదితరాలపై విద్యార్థులకు పూర్తిగా కృత్యాధార బోధనతో అవగాహన కల్పించారు.

– కడ్తాల్